
సాక్షి బాపట్ల

3

బుధవారం । 22 । మార్చి । 2023



ఆర్జిత సేవలకు డిమాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు రికార్డు స్థాయిలో ఉభయ దాతలు పాల్గొని పూజలు జరిపించుకున్నారు.



కోదండరాముడిగా నృసింహుడు

మంగళగిరి: లక్ష్మీ నృసింహస్వామి వారి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా మంగళవారం కోదండరాముడి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

రెండు కరోనా కేసులు



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తాడేపల్లిలో నమోదయ్యాయి. జిల్లాలో కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.

న్యూస్‌రీల్

జాతీయ కబడ్డీ పోటీలకు ఇంకొల్లు క్రీడాకారిణి



చినగంజాం: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఇంకొల్లుకు చెందిన కబడ్డీ క్రీడాకారిణి జే కోమలి ఎంపికయ్యారు. హరియాణాలో మార్చి 23 నుంచి 26 వరకు నిర్వహించే 69వ జాతీయ స్థాయి సీనియర్ మహిళా ఆంధ్ర కబడ్డీ జట్టుకు ఆమెను ఎంపిక చేశారు. ఆమె ఎంపికపై ఆంధ్ర కబడ్డీ కార్యదర్శి వై శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు, అధ్యక్షులు ఎస్ అర్జున రావు, కోశాధికారి సీహెచ్ పుల్లయ్య, చైర్మన్ పీ భాస్కర్, సీనియర్ క్రీడాకారుడు కేవీ రమణారెడ్డి, పీ రామచంద్రరావులు మంగళవారం అభినందనలు తెలిపారు.

అర్జీ గడువు దాటితే రూ.100 జరిమానా..

గుంటూరు వెస్ట్: గ్రామ, వార్డు సచివాలయాలు మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులను గడువు లోపు పరిష్కరించకపోతే సంబంధిత అధికారికి రోజుకు రూ.100 జరిమానా విధిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీని కోసం ప్రత్యేక ఖాతాను తెరవనున్నారు. అర్జీల పరిష్కారంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, స్పందన కార్యక్రమాలకు సరిగ్గా హాజరు కాకపోవడం లాంటి చర్యలు ఇటీవల అధికమయ్యాయి. దీంతో కలెక్టర్ ఈనిర్ణయం తీసుకున్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణలో సేవలకు పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం, ఐటీసీలోని సెర్ప్, ఫినిష్ ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన ఎంపీడీఓలు, ఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, క్లాప్‌మిత్రలు, షెడ్ మిత్రలను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, సీఈఓ జె.మోహనరావు, డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త పీఎస్ పద్మాకర్, డీపీఓ ఆర్.కేశవరెడ్డి, జెడ్పీ అకౌంట్స్ అధికారి జి. శ్రీనివాసరావు, ఐటీసీ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ గౌరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


కేజీబీవీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నకరికల్లు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి సోమవారం తెలిపారు. ఐదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు స్టడీ సర్టిఫికెట్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 40ఖాళీలు మాత్రమే ఉన్నాయని ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కోరారు.

ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొనండి

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా నిర్వహించే పంచాంగ శ్రవణంలో పాల్గొనాలని మంగళవారం ఆలయ ఈఓ సునీల్‌కుమార్ భక్తులను కోరారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆలయంలో నిర్వహించే ఉగాది పంచాంగ శ్రవణంలో శోభకృత్ నామ సంవత్సర ఫలితాలను, గ్రహగమనాలను, వాటి ఫలితాలను ఆలయ అర్చకులు వివరిస్తారన్నారు. స్థానిక కోదండరామాలయం, పాండురంగస్వామి ఆలయం, హనుమద్గీతామందిరంలో కూడా ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 534.50 అడుగుల వద్ద ఉంది. ఇది 175.0650 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,217, ఎడమకాలువకు 3,035, ఎస్ఎల్‌బీసీకి 1,500, వరదకాలువకి 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 14,072 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 14,072 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 813.00 అడుగుల వద్ద ఉంది. ఇది 36.0870 టీఎంసీలకు సమానం.

చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు

- కలెక్టర్ కె.విజయకృష్ణన్
- రాగిజావ పంపిణీ ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యేలు కోన, కరణం



విద్యార్థినులతో కలసి రాగిజావ తాగుతున్న ఎమ్మెల్యేలు కోన రఘుపతి, కరణం బలరామకృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

బాపట్ల: ప్రభుత్వం పంపిణీ చేసే రాగిజావ చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ అన్నారు. జగనన్న గోరు ముద్దలో భాగంగా బడిపిల్లలకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. విద్యార్థులనుద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్నిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, బాపట్ల, చీరాల శాసనసభ్యులు కోన రఘుపతి, కరణం బలరామకృష్ణమూర్తి, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డిలతో కలసి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.రామారావు, డిప్యూటీ డీఈఓ జి.వెంకటేశ్వర్లు, ఎంఈఓ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చదువులు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల స్థాయిని మెరుగు పరచడానికి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని ఆమె వివరించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అధికపోషకాలున్న రాగిజావ పంపిణీ ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనత నివారణకు దోహదపడుతుందన్నారు. జిల్లాలో 1421 పాఠశాలల్లో లక్షా 8 వేల 314 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. రోజుమార్చి రోజున రాగిజావ పంపిణీకి ప్రభుత్వం ప్రతి నెలా రూ.2.8 కోట్ల నిధులు వెచ్చించనుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తామన్నారు.

రాగి జావతో పౌష్టికాహారం

చిన్నారులకు పౌష్టికాహారం అందించడానికి జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ అమలుచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరిని తన సొంత బిడ్డలుగా సీఎం చూసుకుంటున్నారు. బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని చిన్నారులు తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఎదుగుతారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ, నాణ్యమైన విద్యాబోధన అందించడం అభినందనీయమన్నారు.

–కోన రఘుపతి,
ఎమ్మెల్యే, బాపట్ల

ఆరోగ్యమే మహాభాగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న రాగి జావ పంపిణీ వల్ల ఎంతోమందికి మేలు జరుగుతుంది. పాఠశాలల్లోని చిన్నారులకు ఇచ్చే రాగిజావ ఆరోగ్యకం. నాణ్యత ప్రమాణాలతో రాగిజావను తయారుచేసి విద్యార్థులకు వేడిగా ఇవ్వాలి.

–కరణం బలరామకృష్ణమూర్తి,
చీరాల ఎమ్మెల్యే

ఆరోగ్యం పెంపునకు కృషి

చిన్నారులలో విద్య, ఆరోగ్యం పెంపుదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ భాగస్వామ్యంతో రాగిజావ అందించడం శుభ పరిణామమన్నారు. విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ అభివృద్ధి చేయడానికే ఇలాంటి కార్యక్రమాలను అమలుచేస్తున్నారు.

–బత్తుల బ్రహ్మానందరెడ్డి,
ఏపీ మార్కెటింగ్ కమిటీ
ప్రభుత్వ సలహాదారు



శోభితమై.... శోభకృతమై...

ఉగాది చేసే ప్రతి సవ్వడిలో మహోపదేశముంటుందట. అది పంచాంగ పఠనమైనా, షడ్రుచుల సమ్మేళనమైనా. 'మనింటికి చుట్టాలు వచ్చివెళ్లినట్లుగా వసంతం వచ్చి వెళ్లదు.. ఒక జీవన సూత్రాన్ని మాత్రం కచ్చితంగా తెలియచేసే వెళ్తుంది'. వేప చెట్టుకు వేప పువ్వు, మామిడి చెట్టుకు పిందెలు, కోయిల గొంతుకు కుహూ రాగాలు.. వంటివన్నీ మన ముంగిటకు తెచ్చేది ఉగాది పర్వదినమే. అందుకే అది ఊహలకు 'గాదె' అయ్యింది. 'తరలిరాద తనే వసంతం.. తనదరికి రాని వనాల కోసం' అని సీతారాముడు పదవిన్యాసం చేసింది ఈ వసంతాన్ని పూర్తిగా తనకుతాను ఆకళింపు చేసుకోబట్టే. అందుకే జీవితాల్లో శిశిరానికి చోటివ్వకూడదని పెద్దలు చెబుతారు. 'శిశిరంలో మోడువారినా వసంతంలో చిగురిస్తావు / గ్రీష్మ తాపముందని తెలిసినా వర్షమొస్తుందని అభయమిస్తావు, ఓ ప్రకృతి నీవిచ్చిన వన్నీ మాకు మధుమాసాలే' అని చెబుతాడు ఓ యువకవి. ప్రతి వ్యక్తి జీవితంలో 'వసంతం' అవసరమే. అయితే దాన్ని మనకు మనమే ఆహ్వానించుకోవాలి. ఒత్తిడి లేని జీవనం, కాలుష్యం ఎరుగని ప్రకృతి మధ్య జీవనం సాగితేనే అది సాధ్యం. అలా ఉండగలిగితే వారి జీవితాల్లోకి 'శిశిర' ప్రవేశం ఉండదు. కలియుగం ఆరంభమైనది ఉగాది నాడే అని చెప్పినా, జీవితం షడ్రుచులమయం కావాలని బోధించినా.. (మధుర (తీపి) ఆమ్ల (పులుపు), కటు (కారం), కషాయ (ఒగరు), అవగణ (ఉప్పు), తిక్త (చేదు).. వాటన్నిటి పరమార్థం.. అంతరార్థం నిత్య వసంతమై జీవితాలు సాగాలనే. అలాంటి సుసంపన్నమైన జీవనం ఈ 'శోభకృత్ నామసంవత్సరంలో అందరికీ ఒనగూడాలని ఆశిద్దాం.

– గుంటూరు డెస్క్

'శోభకృత్'లో సుఖశాంతులతో వర్ధిల్లాలి





సత్తెనపల్లి: శుభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలని రాష్ట్ర మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున, అంబటి రాంబాబులు వేర్వేరు ప్రకటనలలో ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనమైన జీవితంలో ఆనందోత్సాహాలు పూయించేది ఉగాది పర్వదినమని వివరిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆరుగురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రాంతం
బి.కల్యాణ్‌రాజు	టి.చుండూరు సర్కిల్	సంతపేట (నెల్లూరు-3 టౌన్ పీఎస్)
షేక్.అన్వర్‌బాషా	సంతపేట (నెల్లూరు-3 టౌన్ పీఎస్)	రేంజ్ కార్యాలయం
పి.వెంకటనారాయణ	రేంజ్ కార్యాలయం	వేదాయపాలెం (నెల్లూరు-5 టౌన్ పీఎస్)
కె.నరసింహారావు	వేదాయపాలెం (నెల్లూరు -5 టౌన్ పీఎస్)	రేంజ్ కార్యాలయం
పి.శ్రీనివాసరెడ్డి	రేంజ్ కార్యాలయం-	నెల్లూరు రూరల్ పీఎస్
కె.వెంకటరెడ్డి	నెల్లూరు రూరల్ పీఎస్	రేంజ్ కార్యాలయం

నూతన ఒరవడిలో అంగన్‌వాడీలు

- ఆంగ్ల మాధ్యమంలో ప్రీ స్కూళ్ల ఏర్పాటు
- ఆటపాటలతో కూడిన విద్య
- బొమ్మలతో అర్థమయ్యే రీతిలో విద్యా బోధన
- బాపట్ల జిల్లాలో 1,888 అంగన్‌వాడీ స్కూళ్లు



చీరాల మండలం దంతంపేట అంగన్‌వాడీ కేంద్రంలో విద్యను బోధిస్తున్న అంగన్‌వాడీ

బాపట్లఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో కేవలం ఆరోగ్య పౌష్టికాహార కేంద్రాలుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికరించి ప్రీస్కూల్ కిట్లతో విద్యార్థులకు అక్షరాలను నేర్పిస్తున్నారు. ప్రాథమిక విద్యకు చిన్నారులను సిద్ధం చేసేలా కేంద్రాలను సుందరంగా ముస్తాబు చేస్తుంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు, పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రీస్కూలు ఏర్పాటు చేసింది. నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా నిధులు కేటాయిస్తోంది. ప్రీస్కూల్లో సదుపాయాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లను తీర్చిదిద్ది వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు నూతన మెళకువలతో, ఆట పాటల ద్వారా ప్రీస్కూలులో చిన్నారులను తీర్చిదిద్దుతున్నారు.

1,888 కేంద్రాల్లో ప్రత్యేక సిలబస్

బాపట్ల జిల్లాలో 25 మండలాల్లో 1,888 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో మూడు సుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 19,927 మంది ఉన్నారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రీస్కూలు కోసం ప్రత్యేక ప్రణాళికలు నూతన సిలబస్ రూపొందించింది. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం నాణ్యమైన, ప్రీస్కూలు కిట్లను అందించింది. వీటితో టీచర్లు సొంతంగా బొమ్మను తయారుచేసి చిన్నారులకు అనుకూలంగా ఇష్టపడేలా విద్యా బోధన చేస్తున్నారు. వివిధ రకాల బొమ్మలు చిన్నారులకు చూపించి పాఠాలు బోధించడం వల్ల వారు ఆసక్తిగా నేర్చుకొని సులభంగా అర్థం చేసుకుంటున్నారు. ఫలితంగా పిల్లల అభ్యసనకు అలవాటు పడి ఆసక్తి చూపడంతోపాటు చిన్న వయసులోనే విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు.

ఆంగ్ల మాధ్యమంలో బోధన

ప్రభుత్వ ప్రీ ప్రైమరీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ఇంగ్లీష్ మీడియం పాఠశాలలుగా తీర్చిదిద్దింది. ఈ మేరకు టీచర్లకు అవసరమైన ప్రత్యేక శిక్షణ సైతం అందిస్తుంది. శిక్షణ పొందిన టీచర్లు ఆంగ్లంపై చిన్నారులకు ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేస్తూ వారిని ప్రేరేపిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల్లో భాగంగా బొమ్మల తయారీకి అవసరమైన చార్టులు రంగు పెన్సిల్స్, స్కెచ్‌లు, రబ్బర్లు తదితర సామగ్రిని ప్రభుత్వం కేంద్రాలకు సమకూర్చింది. వీటి వినియోగంపై సూపర్‌వైజర్లకు ఇప్పటికే స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. సమయానుకూలంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు అవసరమైన శిక్షణ అందించడంతోపాటు వారికి అవసరమైన ప్రత్యేక యూట్యూబ్ ఛానల్ కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

కిట్లతో బోధన



అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూల్‌గా మార్చడం వల్ల పిల్లల కు చాలా ప్రయోజనం. టీచర్లు కిట్లతో చిన్నారులకు బోధిస్తున్నారు. కిట్ల ద్వారా బోధన ప్రారంభమైన తర్వాత కేంద్రాలకు చిన్నారుల రాక పెరిగింది. వారిని ఆకర్షించి వారికి అర్థమయ్యేలా బోధన చేసేందుకు కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ప్రభుత్వంసదుపాయాలను కూడా కల్పిస్తుంది. భవిష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయి.

– కె.ఉమాదేవి,
సీడీపీఓ, బాపట్ల జిల్లా

నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



స్వామీజీ ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యపురంలోని మహావిద్యా పీఠంలో గల అభయ హస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో వసంత నవరాత్రి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహా త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి త్రికాల పీఠార్చనలు, విశేష పూజ, హోమాలు, వేద సభలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం నుంచి ఏప్రిల్ 4వరకు సుబ్రహ్మణ్యపురంలోనే ఉండి ప్రతి రోజు భక్తులకు స్వామీజీ అనుగ్రహ భాషణ చేస్తారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజాది కార్యక్రమాల్లో పాల్గొని శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులు పొందారు.

వేటపాలెం రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు

- అదనంగా రెండు ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి
- త్వరలో నూతన స్టేషన్ భవనం ప్రారంభం



వేటపాలెంలో నూతనంగా నిర్మించిన రైల్వేస్టేషన్ భవనం



నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లాట్‌ఫారంలు

వేటపాలెం: స్థానిక వేటపాలెం రైల్వేస్టేషన్ కొత్త హంగులను సంతరించుకొంది. త్వరలో కొత్త రైల్వేస్టేషన్ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే విజయవాడ-గూడూరు రెండు ప్రధాన రైల్వే ట్రాక్‌లు ఉండగా మూడేళ్లుగా మూడో లైన్ కోసం నిర్మాణం పనులు జరుగుతున్నాయి. దక్షిణ భారతంలో విజయవాడ-గూడూరు లైన్ రైళ్లు, గూడ్సు రైళ్ల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉంటుంది. 288 కిలోమీటర్ల విజయవాడ-గూడూరు మూడో లైన్ కోసం రైల్వే శాఖ రూ.3,246 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల కరవది-చిన్నగంజాం మధ్య 23.5 కిలో మీటర్ల మేర మూడో లైన్ పనులు పూర్తిచేశారు. ఆధునికీకరణలో భాగంగా వేటపాలెంలో ప్రస్తుతం ఉన్న పాత రైల్వేస్టేషన్ ఉన్న ప్రాంతంలో మూడో లైన్ వస్తున్నందున నూతనంగా రెండంతస్తుల రైల్వేస్టేషన్ భవనం నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేశారు. దీంతో స్టేషన్ నూతన శోభ సంతరించుకుంది. గతంలో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మూడు ప్లాట్‌ఫారాలు ఉండేవి. ప్రస్తుతం ఉన్న మూడు ప్లాట్ ఫారాలకు అదనంగా మరో రెండు ఫ్లాట్ ఫారాలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా మరో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. నూతనంగా ఏర్పాటు చేసే స్టేషన్ అందుబాటులోకి వస్తే రైల్వే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. వేటపాలెం నుంచి ప్రయాణికుల రాకపోకలు నిత్యం ఉండటంతోపాటు, జీడీగింజలు, జీడీపప్పు ఎగుమతులు దిగుమతులతో మంచి ఆదాయం వస్తుంటుంది.

గ్రంథాలయానికి రైల్వే శాఖ ప్రత్యేక గుర్తింపు

వేటపాలెంలో నూతనంగా నిర్మించిన రైల్వేస్టేషన్ భవనంపై వందేళ్ల చరిత్ర కల్గిన సారస్వతనికేతనం గ్రంథాలయం భవనాన్ని రైల్వేస్టేషన్‌పై చిత్రీకరించారు. దీంతోపాటు గాంధీజీ వేటపాలెం వచ్చిన చిత్రాన్ని స్టేషన్‌పై తీర్చిదిద్దారు. ప్రయాణికులు ఈ చిత్రాలను ప్రత్యేకంగా వీక్షిస్తున్నారు.

అశ్రునయనాలతో సీఐ అంతిమయాత్ర

నివాళులర్పించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

చీరాల: నెల్లూరు జిల్లా ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న మల్లి నాగేశ్వరరావు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మంగళవారం సాయంత్రం చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామనగర్‌లోని ఆయన స్వగృహంలో ఉంచిన ఆయన పార్థివదేహానికి బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. పోలీసుశాఖకు ఆయన చేసిన సేవలు ఎనలేనివని, ఆయన లేని లోటు తీర్చలేనిదని, ఆయన కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుందన్నారు. శాఖాపరంగా సీఐ కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల పరిహారాలను, రాయితీలను సకాలంలో అందించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అధికార లాంఛనాలతో సీఐ అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్, టూటౌన్, రూరల్ సీఐలు కె.సోమశేఖర్, ఎ.మల్లికార్జునరావు, బాపట్ల రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ బీ.శ్రీకాంత్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



సీఐ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

తీపి, చేదు కలయికే ఉగాది



రేపల్లె: జీవితం సకల అనుభూతుల మిశ్రమం. కష్టం, సుఖలాలను తెలిపే తీపి, చేదు గుర్తులే జీవితం. ఆ జీవితంలో ఆనందోత్సాహాలు పూయించేదే ఉగాది పర్వదినం. నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు.

– మోపిదేవి వెంకట రమణారావు, రాజ్యసభ సభ్యుడు

పన్ను 31లోగా చెల్లిస్తే వడ్డీ రాయితీ

సత్తెనపల్లి: ఆస్తి, ఖాళీ స్థలాల పాత బకాయిలు ఈ నెల 31 లోగా చెల్లిస్తే వడ్డీ రాయితీ పొందవచ్చునని గుంటూరు మున్సిపల్ రీజియన్ ఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో పన్ను వసూలుపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆర్డీ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో 34 ద్వారా వడ్డీ రాయితీ ఇచ్చిందన్నారు. వడ్డీ రాయితీ విషయాన్ని పట్టణ ప్రజలకు ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులకు వార్డు వలంటీర్లు, సెక్రటరీలు తెలియజేయాలని, సోషల్ మీడియా ద్వారా అందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలలో సెలవు దినాల్లో కూడా సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

పోటీల పర్యవేక్షకుడిగా సీతారామిరెడ్డి

జే.పంగులూరు: అసోం రాష్ట్రంలోని గౌహతి పట్టణంలో ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే అంతర్జాతీయ 4వ ఏషియన్ ఖోఖో పోటీల పర్యవేక్షకుడిగా పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఎంపికయ్యారు. కేకేఎఫ్ఐ కార్యదర్శి త్యాగి, అధ్యక్షులు సుధాకర్ మిట్టల్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీతారామిరెడ్డిని రాష్ట్ర ఖోఖో చైర్మన్ డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, అధ్యక్షుడు టీఎస్ఆర్‌కె ప్రసాద్, చీఫ్ ప్యాటర్ ఉగ్రనరసింగహరెడ్డి, ఎంఎస్ఆర్ కళాశాల చైర్మన్ ఎంపీ మాగుంట శ్రీనివాసులు, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అభినందించారు.

తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రం

నిజాంపట్నం: అంతరించిపోతున్న తాబేళ్లను ఎక్కువగా ఉత్పత్తి చేసేందుకు తాబేళ్ల గుడ్లను సేకరించి, పిల్లలను చేయించి సముద్రంలోనికి వదలనున్నట్లు బాపట్ల జిల్లా అటవీశాఖ అధికారి ఎల్ భీమయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీశాఖ రేపల్లె రేంజ్ ఆధ్వర్యంలో తాబేళ్ల గుడ్ల సేకరణ, సంరక్షణ పునరుత్పత్తి కేంద్రాన్ని నిజాంపట్నం సముద్రతీరాన్ని మంగళవారం ప్రారంభించారు. 268 తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదిలిపెట్టారు. ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావు, బీట్ ఆఫీసర్ మోహన్‌రాజు, ప్రాజెక్ట్ మేనేజర్ రంగనాయకులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశపు ప్రకటన

ది. గుంటూరు సిటీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ కన్స్యూమర్స్ స్టోర్స్ లిమిటెడ్ (నెం: జి–2085), 4/3 అరండల్‌పేట, గుంటూరు వారి 5వ సర్వ సభ్య సమావేశము ది. 26–03–2023 ఆదివారం ఉదయం 11:00 గం॥లకు స్టోర్స్ ఆవరణలో జరుపుటకు నిర్ణయించడమైనది. కావున సంఘ సభ్యులందరు ఈ సర్వసభ్య సమావేశమునకు హాజరై, జయప్రదము చేయవలసినదిగా కోరుచున్నాము.

అజెండా విషయములు:

1) 01–04–2023 నుండి 31–03–2024 వరకు బడ్జెట్ సంవత్సరమునకు ...

2) అధ్యక్షుల వారి అనుమతితో ఇతర అంశములు.

తేది : 21-03-2023
స్థలం : గుంటూరు

ఇట్లు శ్రీ కడపా శ్రీనివాసరావు
అధ్యక్షులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI

విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2540922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ కె.యస్.హెచ్.శాస్త్రి (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 89784 80704,
ఆస్తి తనిఖీ కొరకు : 98488 51713

ఇ.–వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా ... ఇ–వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై ...

1. రుణగ్రహీతలు: శ్రీ సగినాల వెంకటేశ్వర్లు ... గుంటూరు–522001. డిమాండ్ నోటీసు తేది : 11-10-2021. డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.30-09-2021 నాటికి రూ.29,73,810/- + తేది.01-10-2021 నుండి వడ్డీ ...

రిజర్వు ధర : రూ.22,25,000/-	ధరావత్తు : రూ.2,22,500/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	

2. ... డిమాండ్ నోటీసు తేది: 19-08-2021 ... రూ.1,74,66,305.66 పై ...

రిజర్వు ధర : రూ.12,00,000/-	ధరావత్తు : రూ.1,20,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	

3. ... (Trasinyai) ... డిమాండ్ నోటీసు తేది: 21-01-2020 ...

రిజర్వు ధర : రూ.37,00,000/-	ధరావత్తు : రూ.3,70,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	

4) ... డిమాండ్ నోటీసు తేది: 14-12-2020 ...

5) ... డిమాండ్ నోటీసు తేది: 14-12-2020 ...

రిజర్వు ధర : రూ.1,50,00,000/-	ధరావత్తు : రూ.15,00,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	
రిజర్వు ధర : రూ.35,00,000/-	ధరావత్తు : రూ.3,50,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	
రిజర్వు ధర : రూ.39,00,000/-	ధరావత్తు : రూ.3,90,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	
రిజర్వు ధర : రూ.13,00,000/-	ధరావత్తు : రూ.1,30,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	
రిజర్వు ధర : రూ.8,00,000/-	ధరావత్తు : రూ.80,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-
ఇ–వేలం తేది : 27-04-2023	సమయం : ఉ 11.00 గంల నుండి మ 02.00 గంల వరకు	

ఇ–వేలం నియమ నిబంధనలు

... www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices ... https://www.mstcecommerce.com/auctionhome/ibapi ... 033-22901004 ...

తేది: 21-03-2023, ప్రదేశం: విజయవాడ   సం/– అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా